క్లుప్తంగా

జాతీయ పర్యాటక దినోత్సవం

మధిర: జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ శీలం ఇందిర మాట్లాడుతూ.. పర్యాటక రంగ ప్రాధాన్యాన్ని చెబుతూ, దేశ సమగ్రాభివృద్ధిలో పర్యాటకరంగ పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

ముదిగొండ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేయగా పోలీస్ స్టేషన్‌లో శనివారం వారికి సీఐ మురళి అందజేశారు. బాధితుల వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా రూ.60వేల విలువైన ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. కాగా, ఫోన్లు పొరపాటుగా కోల్పోయినా, చోరీ జరిగినా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే కనుకొనగడం సాధ్యమవుతుందని వెల్లడించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బోనకల్: మండలంలోని వివిధ గ్రామాల వారికి మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శనివారం టెలికాం అడ్వైజరీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ అందజేశారు. చిన్నబీరవల్లి, తూటికుంట్ల, బోనకల్, గోవిందాపురం(ఎల్), చొప్పకట్లపాలెం, ఆళ్లపాడు గ్రామాల్లో పలువురికి ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో మంజరైన చెక్కులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, సైదులు, నాగేశ్వరావు, రమేష్, సురేష్, తుళ్లూరి లక్ష్మనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు నగదు వితరణ

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, దాతల సహకారంతో విద్యార్థులకు గత కొద్ది రోజులుగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుచ్చిరెడ్డిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ యరమల శ్రీనివాసరెడ్డి మిడ్ డే మీల్స్ నిర్వహణకు గానూ చేయూతగా రూ.5వేల నగదు అందించి.. భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామారావు, తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వేమిరెడ్డి రామిరెడ్డి తదితరులున్నారు.

రుణమాఫీ చేయాలి

కొణిజర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. శనివారం అమ్మపాలెంలో కె.పరశురాములు అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మపాలెం జగన్నాధుల చెరువు, సవిటి చెరువుకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఈ నెల 26న ఖమ్మంలో నిర్వహించే రైతు సంఘం మోటర్ సైకిల్ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, లక్ష్మయ్య, సరోజిని, సుబ్బారావు, వెంకన్న, రాము పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి కోసం ధర్నా

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై గ్రామానికి చెందిన నల్లగొండ ఆదినారాయణ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలంటూ శనివారం ధర్నాకు దిగాడు. ఆయన రేకులతో ఇంట్లో నివాసముంటుండగా తాజాగా ప్రకటించిన లబ్ధిదారుల జాబితాలో పేరు రాలేదు. దీంతో ఆయన ధర్నాకు దిగగా గ్రామపంచాయతీ కార్యదర్శి రఘు ఫోన్‌లో తహసీల్దార్ కూరపాటి అనంతరాజుతో మాట్లాడించారు. గ్రామ సభలో వెల్లడించింది ప్రాథమిక జాబితానేనని, అర్హులందరికీ ఇల్లు మంజూరవుతాయని చెప్పడంతో ఆదినారాయణ ధర్నా విరమించాడు.

సాగునీరు విడుదల చేయాలి

తల్లాడ: వారబందీ పద్ధతిని ఎత్తివేసి సిరిపురం మేజరుకు వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు శనివారం తల్లాడ జల వనరులశాఖ డీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి మాట్లాడారు. సిరిపురం మేజరు పరిధిలోని తెలగవరం, తల్లాడ మైనర్లకు నీరందక వరి పైరు వడబడి పోతుందన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు వెంకటయ్య, కాంగ్రెస్ నాయకుడు రాయల రాము.. ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దృష్టికి తీసుకెళ్లగా.. వారు తల్లాడ ఎన్‌ఎస్‌పీ డీఈ శ్రీనివాసరావు, కల్లూరు ఈఈ లకు నీటిని విడుదల చేయాలని చెప్పడంతో వారు అంగీకరించారు. దీంతో రైతులు ఆందోళనను ఉప సంహరించారు.

భక్తులకు అన్నదానం

మధిర: మధిర బంజారా కాలనీలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టూరి రాజా, కృష్ణకుమారి దంపతుల కుమారుడు దుర్గా శ్రీనివాస్ అరవింద చౌదరి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ కౌన్సిలర్ మల్లాది వాసు, ఆలయ కమిటీ అధ్యక్షురాలు ప్రమీల ప్రారంభించారు.

ఐదేళ్ల పాలన సంతృప్తినిచ్చింది

నేటితో ముగియనున్న మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం

- రూ.128 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ. 6.27 కోట్ల మిగులు బడ్జెట్
- సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహేష్

అధికార మార్పిడితో..

2019 సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికలప్పుడు 23 స్థానాలకు గాను 23 స్థానాలు బీఆర్ఎస్ పార్టీ కై వసం చేసుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో సహా ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల తర్వాత మరో ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడటంతో బలం 14కు పడిపోయింది. మారిన రాజకీయ సమీకరణలతో ఏడాది నుంచి మున్సిపాలిటీలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధమే నడిచింది. ఇటీవల సిమెంట్ బల్లాలకు గులాబి రంగు వేయటంపై పెద్ద వివాదమే జరిగింది.



సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం

సత్తుపల్లి: 'నాకు వచ్చిన అవకాశాన్ని ప్రజల కోసం పని చేశాను.. సత్తుపల్లి పట్టణ అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేశాను.. ఐదేళ్ల పాలన సంతృప్తినిచ్చింది.' అని సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. ఆదివారంతో మున్సిపల్ పాలకవర్గం పాలన ముగియనుండడంతో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బాధ్యతలు చేపట్టగానే అసంపూర్తిగా ఉన్న సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయ భవనాన్ని రూ.75 లక్షలు వెచ్చించి భవనాన్ని పూర్తి చేశానని.. కార్యాలయం హుందా తనం ఉట్టిపడేలా మహాత్ముడి విగ్రహం, వంద అడుగుల జాతీయ జెండా, అశోకచక్రం, నాలుగు సింహాల జాతీయ చిహ్నం, పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దామన్నారు. తాను పదవి చేపట్టినప్పుడు రూ. 2.75 కోట్లు నిధులు ఉంటే.. తాను పదవి విరమణ సమయానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.94 కోట్లు, జనరల్ ఫండ్ 6.25 కోట్లు కలుపుకొని రూ.9.22 కోట్లు నిధులు ఉంచామన్నారు.

రూ.128 కోట్లతో..

సత్తుపల్లి పట్టణంలో రూ.128 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని, పట్టణం మొత్తం సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించామన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కాంస్య విగ్రహం, ఐలవ్ సత్తుపల్లి ఏర్పాటు చేశామన్నారు. పారిశుద్ధ్య అవసరాల కోసం నాలుగు ట్రాక్టర్ల నుంచి 17 ట్రాక్టర్లు, జేసీబీ సమకూర్చామన్నారు. అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వీటిలో రూ.30కోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

సండ్రకు రుణపడి ఉంటా..



సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్‌గా నాకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు రుణపడి ఉంటా. సత్తుపల్లి పట్టణ అభివృద్ధికి అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు.

– కూసంపూడి మహేష్, మున్సిపల్ చైర్మన్, సత్తుపల్లి

రాష్ట్ర రాజకీయాలను శాసించేది మధిర నాయకులే



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నామా, పక్కన ఎమ్మెల్సీ మధు తదితరులు

మధిర: రాష్ట్ర రాజకీయాలు ప్రభావితం చేసేవారు మధిర నాయకులే ఉండడం ఈ ప్రాంత వాసులకు గర్వకారణమని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ అన్నారు. మధిరలో మున్సిపల్ పాలకవర్గానికి శనివారం వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పోరాటాలకు పురిటి గడ్డ అయిన మధిరలో అత్యధికంగా విద్యావంతులు ఉన్నారన్నారు. జిల్లా తొలి మంత్రి శీలం సిద్దారెడ్డి, సీపీఎం శాసనసభ పక్ష నేత బోడెపూడి వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తదితరులు ఇక్కడి వారేనని తెలిపారు. ఐదేళ్లలో మున్సిపల్ పాలకవర్గం మధిరను రూ.150కోట్ల నిధులతో అభివృద్ధి చేయగా, రానున్న కాలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వద్ద ఆర్థిక శాఖ కూడా ఉండటంతో ఆయన సహకారంతో మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వరావు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా మధిర అభివృద్ధి కోసం పాలకవర్గం కృషి చేసిందన్నారు. అనంతరం చైర్ పర్సన్ మొండితోకలత, వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత, మధిరకు సర్పంచ్గా పనిచేసిన డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, న్యాయవాది తూములూరు కృష్ణారావు, వాసంశెట్టి లక్ష్మీప్రియను సన్మానించారు. మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, నల్లగట్ల స్వామిదాస్, మొండితోక జగన్మోహన్ రావు, కౌన్సిలర్ మల్లాది వాసు, వివిధ పార్టీల నాయకులు సూరంశెట్టి కిషోర్, మల్లాది హన్మంతరావు, మిర్యాల రమణగుప్తా, పడకంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో కత్తెర పురుగుకు చెక్

కొణిజర్ల: మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణకు చేనులో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని కొణిజర్ల మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ సూచించారు. మండలంలోని ఉప్పలచలకలో పలువురు రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కత్తెర పురుగు లార్వా మొక్కజొన్న ఆకులు, కాండాన్ని తింటుందన్నారు. తద్వారా ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడి, ఆకులు కత్తిరించినట్లుగా మారతాయన్నారు. ఆపై మొక్కజొన్న సుడిలో లార్వా చేరి రంధ్రాలు పెడుతుందన్నారు. పూర్తిగా ఎదిగిన లద్దె పురుగు ఆకులను తినేయడంతో కాండం మాత్రమే మిగులుతుందన్నారు. ఈనేపథ్యాన ఎకరాకు ఐదు చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, సరైన మోతాదులోనే ఎరువులు ఉపయోగించాలని సూచించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ బాలాజీ

అంతేకాక 45 రోజుల వరకు కలుపు లేకుండా శుభ్రం చేస్తూ పురుగు నివారణకు వేప సంబంధ క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలని తెలిపారు. లార్వాలకు ఎరగా 10 కిలోల తవుడు, రెండు కిలోల బెల్లాన్ని నీటితో కలిపి 24 గంటల పాటు పులియబెట్టాక 100 గ్రాముల థయోడీకార్బ్ రసాయన మందు కలిపి మొక్క సుడిలో వేయాలని సూచించారు. ఇలా చేస్తే బెల్లం వాసనకు లార్వాలు తిని చనిపోతాయని పేర్కొన్నారు.

దేవతామూర్తుల కల్యాణం

వైరా: వైరా శాస్త్రినగర్‌లో శ్రీ సత్యసాయి వేద పాఠశాలలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రెండో రోజు శనివారం దేవతామూర్తుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ.. దేవతామూర్తుల కల్యాణం వల్ల భక్తులకు మంచి శుభ ఫలితాలు అందుతాయని తెలిపారు. అనంతరం భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న సత్యసాయి సేవా సమితి ట్రస్టు సభ్యులు, వేద పండితులు

ఎంపీడీఓకు వినతి

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో పనికి ఆహారం పథకంలో అవకతవకలు జరిగాయనీ శనివారం బీజేపీ నాయకులు ఎంపీడీఓ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ఆపతి వెంకటరామరావు మాట్లాడుతూ.. అన్నారుగూడెంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధిదారుల ఎంపికలో భూమిలేని నిరుపేదలకు అన్యాయం జరిగిందన్నారు. గ్రామంలో 500మంది భూమి లేని నిరుపేదలు ఉంటే కేవలం కంటితుడుపు చర్యగా నామ మాత్రంగా లబ్ధిదారులను గ్రామ సభలో ప్రకటించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు, నరేష్, రామారావు, సతీష్ పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

మధిర: మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎంఈఓ వై.ప్రభాకర్ తెలిపారు. మాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు సుమారు రూ.60 వేల విలువైన పాఠశాల నేమ్ బోర్డు, సూచిక బోర్డు, సీసీ కెమెరాలు అందించగా.. ఆ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ, హెచ్ఎం శ్రీహరి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ రకాల సౌకర్యాలను దజేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు పోతుకూచి కల్యాణ చక్రవర్తికి, ఫౌండేషన్ సభ్యులు మేడేపల్లి శ్రీనివాసరావు, సంక్రాంతి శ్రీనివాసరావు లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయి కష్ణమాచార్యులు, ప్రసాదరావు, సునీత, ఆర్.బి శ్రీనివాసరావు, ఇబ్రహీం, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, వరప్రసాద్, ఇస్సాక్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాజాభివృద్ధికి కృషి

సత్తుపల్లిరూరల్: క్రైస్తవ సమాజాభివృద్ధికి కృషి చేస్తుందని ఇండిపెండెంట్ అసోసియేషన్ క్రిష్టియన్ కమిటీ(ఏఐసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు పి.ఏనోష్‌కుమార్ అన్నారు. శనివారం సత్తుపల్లి మండలం గంగారంలోని షాలేముగ్రేస్ పార్థనామందిరంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. క్రైస్తవులు, క్రైస్తవ సమాజంపై జరుగుతున్న దాడులను ఏఐసీసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పి.నిర్మల్‌కుమార్, బాలరాజు, ఏబినేజర్, డేవిడ్‌రాజు, కెసడి రాజు, జయరాజు, మేషక్, విల్సన్, సంజీవరావు పాల్గొన్నారు. అనంతరం సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడిగా కె.రవి, ఉపాధ్యక్షుడిగా బెన్నీ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారిగా ఏసోబు, జాయింట్ సెక్రటరీగా విజయ్‌పాల్‌ను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏనోష్‌కుమార్

జిల్లాస్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: ఈ నెల 22, 23వ తేదీల్లో కొత్తగూడెంలో జరిగిన ఉమ్మడిజిల్లాల స్థాయి క్రీడా పోటీల్లో గంగారం సాయిస్ఫూర్తి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వాలీబాల్ బాలుర విభాగంలో ప్రథమ స్థానం, టేబుల్ టెన్నిస్‌లో ప్రథమ స్థానం, చెస్‌లో ద్వితీయ స్థానం, షార్ట్‌పుట్‌లో ద్వితీయ స్థానం సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి, పీడీ దేశిరెడ్డి రఘుపతిరెడ్డి, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డిలు అభినందించారు.

క్రికెట్ పోటీల్లో..

పెనుబల్లి: అండర్–17 బాలుర క్రికెట్ పోటీల్లో పెనుబల్లి మండల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల అండర్–17 బాలుర క్రికెట్ పోటీలలో 800మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మరీదు మౌనిష్, రమేష్ హైస్కూల్ విద్యార్థి ముజాహిద్, అరుణోదయ స్కూల్ విద్యార్థి రామ్ చరణ్, రిజనెన్స్ స్కూల్ విద్యార్థి చందు, మోడల్ స్కూల్‌కు చెందిన లక్ష్మీ వెంకట్ కుమార్ విద్యార్థులు క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అర్హత సాధించినట్లు ఆయా పాఠశాలల యాజమాన్యం తెలిపారు. అలాగే వీరు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న క్రికెట్ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.

మేడేపల్లి రైతుకు అవార్డు



రైతు సతీష్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

ముదిగొండ: మండలంలోని మేడేపల్లికి చెందిన రైతు సామినేని సతీష్‌కు అవార్డు దక్కింది. ఆయన ఆయిల్‌పామ్‌లో సాగులో తక్కువ మోతాదుతో ఎరువులు వాడుతున్నా మెరుగైన విధానాలతో అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఈనేపథ్యాన హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో సతీష్‌ను రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ అధికారులు వంశీకృష్ణారెడ్డి, సరేష్ కాంబ్లే తదితరులు సన్మానించారు.

కాసాని ఐలయ్యకు నివాళి



పెనుబల్లి: ఐలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల/పెనుబల్లి: సీపీఎం సీనియర్ నాయకుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కాసాని ఐలయ్య మృతి సీపీఎం పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ, పెనుబల్లి మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు తెలిపారు. శనివారం కొణిజర్లలో నాయకులు సంతాపం ప్రకటించగా.. పెనుబల్లి మండలం వీయంబంజర్‌లో సీపీఎం కార్యాలయంలో ఐలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ భలో – పేతానికి, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, కుటుంబరావు, వెంకయ్య, శ్రీనివాసరావు, తాతాపద్మ, వెంకటేశ్వర్లు, అంజయ్య, కృష్ణార్జునరావు, రాంబాబు, ప్రసాద్, హరిచంద్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, సత్యం, చిరంజీవి, నరిసింహారావు, ప్రతాప్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో కబడ్డీ పోటీలు

కారేపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, కామ్రేడ్ యువసేన ఆధ్వర్యంలో.. కారేపల్లి, కామేపల్లి మండలాల స్థాయి కబడ్డీ పోటీలు శనివారం కారేపల్లి బీసీ కాలనీ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ పోటీలను కాంగ్రెస్ నాయకులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, శ్రీనులు ప్రారంభించారు. లీగ్ దశలో.. కారేపల్లి యాదవ్‌నగర్, విశ్వనాథపల్లి జట్లు తలపడగా, విశ్వనాథపల్లి జట్టు విజయం సాధించింది. అదే విధంగా చంద్రళ్లగూడెం–గోపాలపురం టీంలు తలపడగా.. గోపాలపురం జట్టు, భాగ్యనగర్–చుట్టుతండా జట్లు తలపడగా.. చుట్టుతండా జట్టు విజయం సాధించాయి.

కల్లూరు బస్‌స్టేషన్‌కు ప్రగతి చక్రం అవార్డు

సత్తుపల్లిటౌన్: ఖమ్మం రీజియన్ పరిధిలో ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలలో సీ క్లాస్ కేటగిరి విభాగంలో కల్లూరు బస్‌స్టేషన్‌కు ఉత్తమ ప్రగతి చక్రం అవార్డు లభించింది. కరీంనగర్ జోన్ ఈడీ ఖుస్రోషకాన్ చేతుల మీదుగా సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి నగదు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అదే విధంగా బెస్ట్ కేఎంపీఎల్ డ్రైవర్‌గా మహేష్ అవార్డు సాధించారు. వీరిని రీజినల్ మేనేజర్ సరిరాంనాయక్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ జీఎస్ ప్రవిత్ర అభినందించారు.

సోదరికి తమ్మినేని..

చింతకాని: మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అక్క తోటకూరి సరోజిని(75) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. మృతదేహాన్ని వీరభద్రం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, మండల కార్యదర్శి రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల హాస్టల్‌లో ఏటీడబ్ల్యూఓ బస



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏటీడబ్ల్యూఓ వెంకటేశ్వరరావు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహంలో శుక్రవారం రాత్రి మధిర సహాయ షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కొత్తా వెంకటేశ్వరరావు బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి.. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం అందించిన మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శరత్ బాబు, ట్యూటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాప్

పెనుబల్లి: మండలంలోని నీలాద్రీశ్వరాలయంలో ఫిబ్రవరిలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ గంటా ప్రతాప్ అన్ని శాఖల అధికారులకు తెలియజేశారు. శనివారం మండలంలోని నీలాద్రీశ్వరాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, గతంలో జరిగిన పొరపాట్లను సరి చేసుకుని, అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎస్సై వెంకటేష్, ఆలయ కమిటీ చైర్మన్ చిన్న నరసింహారావు, కమిటీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు.. వజ్రాయుధం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కు ఒక వజ్రాయుధమని, 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఓటు ప్రాధాన్యతను తెలిపేలా ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు.

– సాక్షి నెట్‌వర్క్



ముదిగొండ: సెంటర్‌లో మానవహారంతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ నరసింహారావు



వైరా: ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



తల్లాడ: అన్నారుగూడెంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మధిర: వైఎస్ఆర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేస్తున్న మధిర కోర్టు న్యాయమూర్తి, అధికారులు



ఏన్కూరులో..



సత్తుపల్లిరూరల్: మిస్ట్ కళాశాలలో..



వైరారూరల్: గరికపాడు పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



వేంసూరు పాఠశాలలో..



బోనకల్: కస్తూర్బాగాంధీ బాలికల కళాశాలలో..



చింతకాని: ర్యాలీ నిర్వహిస్తున్న మండల అధికారులు



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ కళాశాలలో..



కల్లూరు: ఆర్డీఓ కార్యాలయం ఎదుట..



ఎర్రుపాలెం: ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ ఉషాశారద, ఓటర్లు



కారేపల్లి: బస్టాండ్ సెంటర్‌లో..